క్లుప్తంగా

చేతిరాత పోటీల విజేతకు కలెక్టర్ అభినందన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి చేతిరాత పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజయవాడ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని డి.ధరణిప్రియను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం అభినందించారు. ఈ పోటీల్లో మొత్తం 11,624 మంది విద్యార్థులు పాల్గొనగా ధరణిప్రియ రెండు రాష్ట్రాల్లో కలిపి 3వ ర్యాంకు సాధించింది. కలెక్టర్ బాలాజీ మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో విజేత ధరణిప్రియను సన్మానించి, ఆమెకు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందజేసి అభినందనలు తెలిపారు. ఇలానే ధరణిప్రియ మరిన్ని పతకాలను సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ధరణిప్రియకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు, తనిఖీల నేపథ్యంలో సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ పైపులరోడ్డు ఫీడర్ పరిధిలోని షాదీఖానా రోడ్, నూజివీడు రోడ్డు, కృష్ణ హోటల్ సెంటర్, దుర్గాబార్ రోడ్డు, తిలక్ రోడ్డు, యార్డ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రంగనాథునికి ప్రత్యేక పూజలు

విజయవాడకల్చరల్: ధనుర్మాసం సందర్భంగా శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని దేవాలయ సముదాయంలో మంగళవారం గోదాదేవి రంగనాథుడు, అలివేలు మంగా సమేత సమేత శ్రీ వెంకటేశ్వరస్వామికి అర్చక స్వాములు ప్రాతహ్ఃకాల పూజ, స్వామి వారికి షోడపోచారములతో పూజలు నిర్వహించారు. మహిళలు గోదాదేవి రచించిన పాశురాలను పఠించారు. ధర్మాధికారి దంపతులు శ్రీ వెంకటేశ్వర స్వామికి చేసిన అర్చనలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కంచికామకోటి పీఠపాలిత లబ్బీపేట శారద చంద్రమౌళీశ్వర, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వేణుగోపాల్, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

జాకిర్ హుస్సేన్ మృతికి సంతాపం



విజయవాడకల్చరల్: ప్రఖ్యాత తబలా కళాకారుడు ఉస్తాద్ జాకిర్ హుస్సేన్ మృతికి నగరంలోని తబలా, మృదంగ కళాకారులు మంగళవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై నిర్వహించిన సభలో సంతాపం ప్రకటించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ కళాకారుడు జాకిర్ హుస్సేన్ అన్నారు. ప్రపంచ సంగీత ప్రపంచంలో తిరుగులేని రారాజు అని అభివర్ణించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ.. జాకిర్ హుస్సేన్‌కు విఖ్యాత గ్రామీ అవార్డ్ లభించిందని, కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేయాలని కోరారు. వాయిద్య కళాకారులు ఇజ్రాయల్, తబలా వాసు, జీలక ఏడుకొండలు, ఎం.ఖురేషి, జయరాజు, కె.రవిబాబు పాల్గొన్నారు. ముందుగా జాకిర్ హుస్సేన్ మృతికి మౌనం పాటించారు.

అఖిల భారతీయ కోలి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎల్ఎన్ రాజు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): అఖిల భారతీయ కోలి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీ ఎల్ఎస్ రాజు(అబ్బు) నియమితులయ్యారు. ఆయనను రాష్ట్ర అధ్యక్షుడుగా నియమిస్తూ కోలి సమాజ్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వీరేందర్ కశ్యప్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనను రాష్ట్ర అధ్యక్షుడుగా నియమించిన వీరేందర్ కశ్యప్, జాతీయ కార్యవర్గ సభ్యులకు పీవీఎల్ఎస్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

31న రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సభ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశానుసారం ఈనెల 31వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సభ కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య ఆడిటోరియంలో జరుగుతుందని సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇళ్ల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక సాధారణ సభకు పాట్రన్‌లు, వైస్ పాట్రన్‌లు, జీవిత సభ్యులు, అసోసియేట్ సభ్యులు హాజరుకావాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం పద్దుల సమర్పణ, కార్యవర్గ నియామకం జరుగుతుందన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- వాహనాల్లోనే మద్యం సేవిస్తున్న మందుబాబులు
- రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఆంధ్రరత్న పార్కు రోడ్డులో నిలిపిన వాహనాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాల్లో ఆటో ఫైనాన్స్ వ్యాపారులు రోడ్డు మీదే రోజుల తరబడి ట్రాన్స్‌పోర్టు ఆటోలు, టాటా ఏసీ వాహనాలు నిలపడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆంధ్రరత్న పార్కురోడ్డు, గిరి వీధి, బీఆర్టీఎస్ రోడ్డులో పెద్ద సంఖ్యలో ఆటో ఫైనాన్స్ సంస్థలు ఉన్నాయి. వాటి యజమానులు రోజుల తరబడి వాహనాలను రోడ్డు మీదే నిలిపి యథేచ్ఛగా తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరి వలన ఈ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు రాకపోకల సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఇతర వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి.. ఇక అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా రావడం లేదంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



బీఆర్టీఎస్ రోడ్డులో మరమ్మతులకు గురైన ఆటోలు

అధికారులకు కనిపించట్లేదా ?

అధిక సంఖ్యలో ప్రజల రాకపోకలు సాగించే ఆయా రోడ్లలో ఫైనాన్స్ సంస్థ యాజమానులు అనాధికారిక ఆటోలు పార్కింగ్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు ఆ ప్రాంతాల్లోని రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్న నగరపాలకసంస్థ అధికారులు, పోలీసులకు ఇక్కడి సమస్య పట్టకపోవడం పట్ల స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఒక వైపు డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనుల కారణంగా సగం రోడ్డు మట్టిగుట్టలతో నిండిపోయింది. మరో సగం నిలిపిన ఆటోల పార్కింగ్‌తో స్థానికులు తమ వాహనాలతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు ఇతర మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని వారు వాపోతున్నారు.

మద్యం సేవిస్తూ హంగామా..

రోజుల తరబడి ఆటోలు నిలపడంతో మందుబాబులు వాటిని తమ ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఆటోల్లోనే మద్యం సేవిస్తూ ఒకరిపై ఒకరు గొడవలకు దిగుతూ, స్థానికంగా భయాకన వాతావరణం సృష్టిస్తున్నారు. ఆటోల పక్కన, సమీపంలోని రోడ్ల మీదే మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్‌లు, బాటిళ్లు పడేయడంతో అటుగా నడిచివేళ్లే పాదచారులు అసౌకర్యానికి గురువుతున్నారు. కొన్ని సందర్భాల్లో మద్యం మత్తులో ఒకరిపై ఒకరు గొడవలకు పాల్పడడంతో పాటు అటుగా రాకపోకలు సాగించే వారిపై కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు చెబున్నారు. దీనిపై పోలీసులు ఆయా ప్రాంతాల్లో ప్రతి రోజు రాత్రిళ్లు బీటు ఏర్పాటు చేసి, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కు రోడ్డులో ఆటోల వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు

అధికారులు చర్యలు తీసుకోవాలి..

ఎటువంటి అనుమతులు లేకుండా అనాధికారికంగా రోడ్డును ఆక్రమించి రన్నింగ్ కండిషన్‌లోని ఆటోలతో పాటు మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుకున్న ఆటోలను రోజుల తరబడి నిలుపుతున్నారు. దీంతో ఆటోల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్, పోలీసు అధికారులు ఆటోల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం సమావేశ హాలులో నేషనల్ క్లీన్ ఎయిర్ పాలసీలో భాగంగా కాలుష్య నియంత్రణ కోసం విజయవాడ నగరపాలక సంస్థ వారి ఆధ్వర్యంలో ఎర్త్ గ్లోబల్, ది ఎనర్జీ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టెరి) ట్రాఫిక్, రవాణా, పొల్యూషన్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణకు విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రమేష్ హాస్పిటల్ నుంచి జమ్మిచెట్టు సెంటర్ వరకు క్లీన్ ఎయిర్ క్వాలిటీని అధ్యయనం చేశారన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్

ఆ రెండు ప్రాంతాల్లో కాలుష్యం అత్యధికం..

రమేష్ హాస్పిటల్, కాశేశ్వరరావు రోడ్డు ప్రాంతాల్లో నగరంలో అత్యధికంగా కాలుష్యం వెదజల్లుతుందని నిపుణులు చేసిన పరిశోధనలో తేలిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, విజయవాడ నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో ఎర్త్ గ్లోబల్ ప్రోగ్రామ్ మేనేజర్ వివేక్ వైద్యనాథన్, ఎనర్జీ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్, ఫెలో అండ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అంజు గోయల్ పర్యవేక్షించారు. చీఫ్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ ఎం.శ్రీరంజని, ఆర్టీవో వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కె.బసవయ్య, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఎం.వినయ్ తేజ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి రావు, ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రతినిధి కె.వెంకటరత్నం, వీఎంసీ ఎన్విరాన్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంబమూర్తి రోడ్డులో యథేచ్ఛగా ఆక్రమణలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 27వ డివిజన్ సాంబమూర్తి రోడ్డు డీ మార్ట్ సమీపంలో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన పలువురు నేతల సహకారంతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఏకంగా దుకాణాల కోసం షెడ్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం గమనార్హం. తమ సొంత స్థలంలో ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపడితే హంగామా చేసే అధికారులు ఇక్కడ యథేచ్ఛగా రేకుల షెడ్లు వేస్తున్నా పట్టించుకోకపోవటం అనుమానాలకు తావిస్తోంది. బావాజీ పేట మూడో రోడ్డు నుంచి డీ మార్ట్ వరకు ఇటీవల కాలంలో రోడ్డుకు ఇరువైపులా బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే ఇక్కడ ఆటోలు సైతం రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీనివల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డీ మార్ట్ వద్ద నిర్మించిన షెడ్డు

కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కళాపోషకుడు, ఆడిటర్ ముష్టి శ్రీనివాస్ అన్నారు. ఏఎస్ మెలోడీస్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన యువ గాయకుడు అయ్యప్పన్ సాయికృష్ణ, సంగీత దర్శకుడు సీహెచ్ ప్రవీణ్ 2024 కేఫా పురస్కారం అందుకున్న సందర్భంగా మంగళవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యంలోనే అయ్యప్పన్ తల్లి స్వాతి వద్ద లలిత, సినీ సంగీతంలో శిక్షణ తీసుకున్నారన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన సినీ, లలిత సంగీత కార్యక్రమాల్లో పాల్గొని తన ప్రతిభను చాటారని తెలిపారు. మీరా కుమార్ మాట్లాడుతూ నగరానికి పేరు తీసుకువచ్చిన యువకులు అయ్యప్పన్, ప్రవీణల కృషిని అభినందించారు. వివిధ సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, చిట్టిబాబు, డీవీ వీరభద్రరావు, జంధ్యాల పరదేశిబాబు, ప్రసూనా రామన్, పరుచూరి విజయలక్ష్మి, అయ్యప్పన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఏఎస్ మెలోడీస్ నిర్వాహకులు ఆరీఫ్ బాషా, షబానాలు వారిని ఆత్మీయంగా సత్కరించారు. మల్లాది స్వాతి పర్యవేక్షణలో గాయనీ గాయకులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.



అయ్యప్పన్ సాయి కృష్ణ, ప్రవీణ్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

బుడమేరులో వ్యర్థాలు, గుర్రపు డెక్క తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీ బుడమేరులో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్కను మంగళవారం జేసీబీతో తొలగించారు. బుడమేరులో కొంతకాలంగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. నగర వాసులు ఇష్టారాజ్యంగా బుడమేరులో చెత్తచెదారం వ్యర్థాలు వేస్తున్నారు. దీని వల్ల నీటి ప్రవాహానిరి ఆటంకం ఏర్పడి దోమలు సైతం పెరుగుతున్నాయి. దీనిపై స్పందించిన అధికారులు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా జేసీబీతో గుర్రపుడెక్క, చెత్తచెదారం, వ్యర్థాలు తొలగించి పరిసరాలు శుభ్రం చేయించారు.

బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో పేరుకుపోయిన చెత్తచెదారం, పిచ్చి మొక్కలను మంగళవారం సాయంత్రం జేసీబీతో తొలగించారు. బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో పిచ్చిమొక్కలు చెత్తచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు సమస్యను వల్లభనేని సతీష్, తోట పాండు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

కర్మల భవనం మరమ్మతులకు చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సీకే రెడ్డి రోడ్డులో శిథిలావస్థకు చేరిన కర్మల భవనాన్ని రూ.19.60 లక్షలతో మరమ్మతులు నిర్వహించనున్నట్లు నగర పాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఇక్కడ కర్మల భవనం మరమ్మతులకు రూ.19.60 లక్షల వ్యయంతో అంచనాలు తయారు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. శిథిలావస్థలో కర్మల భవనం శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు త్వరలోనే మరమ్మతులు చేపట్టనున్నారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన వినియోగదారుల అవగాహన వారోత్సవాలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. వారోత్సవాల్లో భాగంగా వినియోగదారుడు రాజు – నేటి మార్కెట్‌లో వర్తిస్తుందా అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నవీన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవటంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కృష్ణా వర్సిటీ వాలీబాల్ విజేత ఎస్‌డీఎంఎస్‌ఎంకే జట్టు



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల మహిళల వాలీబాల్ పోటీల్లో శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల(ఎస్‌డీఎంఎస్‌ఎంకే) జట్టు సత్తా చాటింది. సిద్ధార్థ మహిళా కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన పోటీలకు పీబీ సిద్ధార్థ డిగ్రీ కాలేజీ(విజయవాడ), ఏజే అండ్ ఎస్‌జే సిద్ధార్థ కాలేజీ(ఉయ్యూరు), డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్‌జీ డీపీ డిగ్రీ కాలేజీ(మైలవరం), మేరీస్ స్టెల్లా కాలేజీ(విజయవాడ), సిద్ధార్థ మహిళా కాలేజీ(విజయవాడ), ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీ(విజయవాడ) జట్లు ప్రాతినిధ్యం వహించాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ఎస్‌డీఎంఎస్‌ఎం కాలేజీ అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఏజీఅండ్ఎస్ సిద్ధార్థ నిలవగా, మూడో స్థానంలో పీబీ సిద్ధార్థ నాల్గవ స్థానంలో మేరీస్ స్టెల్లా కాలేజీ నిలిచి బహుమతులు అందకున్నారు. విజేతలకు ఎస్‌డీఎంఎస్‌ఎం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.హేమ, సెలక్షన్ కమిటీ సభ్యులు మేజర్ స్వామి, డాక్టర్ సుజాత ట్రోఫీలు అందజేశారు. విజేత జట్లను కాలేజీ కన్వీనర్ లలిత్‌ప్రసాద్ అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సంయుక్త పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీలోని అన్ని విభాగాల అధికారులు సంయుక్తంగా నిరంతరం నగర పరిశీలన చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ వివిధ శాఖాధిపతులతో కలిసి 23వ డివిజన్ గవర్నర్‌పేటలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో గవర్నర్‌పేటలోని మహంతి మార్కెట్ వద్ద ఉన్న కల్వర్ట్‌లు, మ్యాన్ హోల్‌లు, వివిధ ఆక్రమణలను అధికారులు గమనించి, వెంటనే వాటిని సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహంతి మార్కెట్ వద్ద పరిశీలిస్తున్న వీఎంసీ అధికారులు

ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రణాళిక అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రణాళిక ఉండాలని, పిల్లలకు ఆర్థిక అవగాహన చిన్నతనం నుంచే నేర్పించాలని ప్రముఖ ట్రైనర్ కె.సరీష్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యులవుదాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్థిక ప్రణాళిక ద్వారా దాచిన డబ్బును ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. ఇందుకుగానూ ఈక్విటీ షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు తదితర పెట్టుబడి మార్గాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ట్రైనర్ సరీష్

పొదుపు తప్పనిసరి..

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమశిక్షణ ఉండాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఆచరించి తద్వారా ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండాలని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజ, కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కోపూరి అరుణ మాట్లాడుతూ అనుకోని ఖర్చులు అవాంతరాలు వచ్చినప్పుడు ఎదుర్కోవటానికి ముందుగానే అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకుగానూ సంపాదించిన వాటిలో కొంత భాగాన్ని పొదుపు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కోపూరి అరుణ, రాజ్యలక్ష్మి, ఎస్ఎల్ జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త స్వీపింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురండి

పటమట(విజయవాడతూర్పు): నగర పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కొత్త స్వీపింగ్ మిషన్లను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా హనుమాన్‌పేటలోని వెహికల్ డిపోను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ నుంచి వచ్చిన 8 కొత్త స్వీపింగ్ వాహనాలను, స్వీపింగ్‌కు అనుగుణంగా బ్రష్‌లు అమర్చి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. స్వయంభు వారి సమన్వయంతో త్వరగా క్లాప్ ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో ఇంటింటి చెత్త సేకరణ జరగాలని అధికారులను ఆదేశించారు. తరచుగా శాఖాధిపతులు వెహికల్ డిపోను సందర్శించి అక్కడ మరమ్మతుల్లో ఉన్న వాహనాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) సత్యకుమారి, ఇన్‌చార్జి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెహికల్ డిపో ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.



వెహికల్ డిపోను సందర్శించి అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో యువత ముందుండాలి

విజయవాడ కల్చరల్: సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో యువత ముందుండాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పార్టీ, ఇతర అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం యువజనోత్సవాలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళా బృందాలు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ప్రారంభించిన శివప్రసాద్ మాట్లాడుతూ.. యువతను చైతన్య పరచడానికి భారత కమ్యూనిస్ట్‌పార్టీ అనేక ప్రణాళికలను రూపొందించిందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక వికాసంతోనే యువత భవిష్యత్ సాధ్యమన్నారు. గురజాడ, శ్రీశ్రీ, పూలే, అంబేడ్కర్ సాహిత్యం యువతకు చేరువ చేయాలన్నారు.



మాట్లాడుతున్న రాజా, వేదికపై నాయకులు

పార్టీకి ఘన చరిత్ర

యువజనోత్సవాలనకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ పార్టీకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రజా పోరాటం ద్వారానే పార్టీ మనుగడ సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీలోనూ వివిధ అనుబంధ సంస్థల కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న జంగాల అజయ్‌కుమార్, చంద్రనాయక్, చలసాని అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈవో లోకేశ్వరి పర్యవేక్షించారు.

ఐజీఎంసీలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు అంచనాలు

విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం(ఐజీఎంసీ)లో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసే నిమిత్తం క్రీడా శాఖ అధికారులు అంచనాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఎస్‌వో కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, కాకినాడ డీఎస్‌డీవో, అథ్లెటిక్స్ కోచ్ డి.శ్రీనివాస్, అధికారులు శివారెడ్డి, వరలక్ష్మి మంగళవారం స్టేడియాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 2027లో జరగబోయే జాతీయ క్రీడలకు సంబంధించి 200 మీటర్లు, 400 మీటర్ల ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు సాధ్యాఅసాధ్యాలను తెలుసుకునేందుకు స్టేడియం చుట్టూ కొలతలు వేశారు. సింథటిక్ ట్రాక్ ఏర్పాటునకు రూ.10 కోట్ల వ్యయం అవుతుందనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి ట్రాక్ ఏర్పాటు చేయాలంటే గ్యాలరీలను కొంత మేర తొలగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టేడియంతో పాటు విద్యాధరపురంలోని మైదానాన్ని పరిశీలిస్తామని చెప్పారు.



సింథటిక్ ట్రాక్ అంచనాలు తయారు చేస్తున్న క్రీడా శాఖ అధికారులు